
# * డిస్కౌంట్ సేల్ *

"కెవ్వ్వ్వ్వ్..." చెవులు గళ్లు పడిపోయే కేక!

ఆ కేకకి గడ్డం గీసుకుంటున్న కాంతారావు చెయ్యివణికి గెడ్డం మీద కసుక్కున గాటుపడింది.

"కెవ్వ్వ్వ్వ్..." అన్నాడు అద్దంలో రక్తాన్ని చూస్కుని కాంతారావు.




"ఏంటి అట్టా అరిచారు? .. ఈ పేపర్లోని అడ్వర్టైజ్‌మెంట్ మీరు కూడా చూశారా? " సంబరంగా అడిగింది అతని భార్య కామేశ్వరి.

"నా గెడ్డం తెగి నేనరిచాను... నువ్వెందుకలా అరిచావ్?..." కోపంగా అడిగాడు కాంతారావు.

"ఇదిగో!... పేపర్లోని ఈ అడ్వర్‌టైజ్‌మెంటు చూసి ఆనందం పట్టలేక అలా అరిచానంతే...."

"ఏంటా ఎడ్వర్‌టైజ్‌మెంట్?" కళ్ళు చిట్లించి అడిగాడు కాంతారావు.

"డిస్కౌంట్ సేల్స్ గురించి! ఏముందో చదివి వినిపించనా?"

"చదువు...." అన్నాడు కాంతారావు మళ్లీ గెడ్డం గీసుకోవడంలో మునిగిపోతూ.

కామేశ్వరి చదవడం ప్రారంభించింది:

"ప్రియమైన మిత్రులారా,

నేను వ్యాపారంలో చాలా నష్టపోయి బొంబాయి నుండి మీ ఊరికి దేభ్యం మొహం వేసుకుని వచ్చాను. ఇలా రావడం నాకెంతో ఆనందంగా ఉంది. ఇక్కడ బజార్లో, సెంటర్లో మా డిస్కౌంట్ సేల్ ఈ రోజునుంచే ఆరంభించాం. ఎంతో నాణ్యమైన, ఖరీదైన బట్టలు మీకు అతి తక్కువ ధరలో అమ్మి ఇంకా దివాళా తీసేసి చేతులు దులుపుకుని మా ఊరెళ్ళిపోదామని అనుకుంటున్నాను. కాబట్టి నన్ను దివాళా తీయించే అవకాశం మీరు పొందుతారని భావిస్తూ, ఈ వేళే మా డిస్కౌంట్ సేల్ కం ఎగ్జిబిషన్‌కి రావాలని కోరుకుంటూ-

మీ
దగాచంద్."

అమ్మకం రేట్ల వివరాలు:
వందరూపాయల బాబా సూట్ పది రూపాయలకే.
"కెవ్వ్...." అరిచింది కామేశ్వరి.
రెండొందల రూపాయల షిఫాన్ చీర యాభై రూపాయలకే!
"కెవ్వు...." మళ్ళీ అరిచింది.
మూడొందలు ఖరీదు చేసే టెరీ ఊల్ ప్యాంట్ పీస్ డెబ్బయిరూపాయలకే!
"కెవ్.... కెవ్వ్...."
యాభై రూపాయల దుప్పటి పది రూపాయలకే!
"కెవ్వ్.... కెవ్వ్.... కెవ్వ్...."
ముప్పయి రూపాయల టవల్ కేవలం అయిదు రూపాయలకే!....
మళ్ళీ సంతోషంతో గుండెలు బాదుకుంటూ అరిచింది కామేశ్వరి.
అలా రేట్ల లిస్టంతా చదివి భర్త మొహం వంక చూసింది. అంతే.... మళ్ళీ కెవ్వుమని అరిచింది.
"అదేంటండీ.... మీ మొహమంతా అలా గాట్లు పడ్డాయేం?.... గెడ్డంకూడా చేసుకోవడం చేతకాదు మొహానికి...."
"కెవ్వు కెవ్వుమని చావుకేకలు పెట్టి నేను ఉలిక్కిపడేలా చేసి ఇప్పుడు గెడ్డం చేస్కోడం రాదంటావేం?.... ఇంకొకసారిలా అరిస్తే పీక పిసుకుతానంతే...." అన్నాడు దీనంగా గంట్లుపడిన మొహాన్ని అద్దంలో చూస్కుంటూ.
"పీక పిసికితే పిసికారు గానీ నన్నక్కడికి తీస్కెళ్ళాక పిసకండి...."
"ఎక్కడికి?...." ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు కాంతారావు.
"ఇంకెక్కడికి.... దగాచంద్ డిస్కౌంట్ సేల్‌కి .... పేచండే వండే వండే.... ప్లీజ్...." గెడ్డం పుచ్చుకుని బతిమిలాడె, "ఛీ.... రక్తం, పాడు"

అంటూ చేతిని కొంగుకి తుడుచుకుంది.

"తీస్కెళ్లనుగాక తీస్కెళ్లను.... అక్కడ కూడ నువ్వు కెవ్వుకెవ్వన అరుస్తావ్...."

"ఊహూ.... నే నరవను.... నన్ను దగాచంద్ డిస్కౌంట్ సేల్ కి తీస్కెళ్ళండీ...."

"ఇప్పుడెందుకూ.... దండగ...." అన్నాడు మొహం చిట్లించి. కామేశ్వరి మొగుడి అమాయకత్వానికి ఫక్కుమని నవ్వింది.

"మీ మొహం.... దండగ మన్కేంటి!.... ఆ దగాచంద్ గాడికి దండగ!!!.... వాడు దివాళా తీద్దామని నిర్ణయించుకుని పాపం మనకంత చవకగా అమ్ముతున్నాడు తెల్సా?.... మీకైతే మూడొందలు ఖరీదు చేసే టెర్రీ ఊల్ ప్యాంట్ డెబ్బయి రూపాయిలకే వస్తుంది తెల్సా?...." భర్తని టెమ్ట్ చేసింది కామేశ్వరి.

"సర్లే.... అలాగే వెళ్దాం...." అన్నాడు కాంతారావు తనుకూడా బట్టలు చవగ్గా కొట్టేయవచ్చు కదా అదే ఆలోచనతో.

రెండు రోజుల తరువాత వాళ్లు దగాచంద్ డిస్కౌంట్ సేల్ కి వెళ్లారు. అక్కడికి జనం విపరీతంగా వస్తున్నారు. చాలా రద్దీగా ఉంది. గుమ్మం దగ్గర నిలబడి ఒక వ్యక్తి భోరుమని ఏడుస్తున్నాడు.

"పాపం.... ఎవరో ఆయన?!.... అతని పర్సెవరైనా కొట్టేశారేమో! అందుకే అలా ఏడుస్తున్నాడు...." కాంతారావు అతనివంక జాలిగా చూస్తూ అన్నాడు. కామేశ్వరి మళ్లీ ఫక్కుమని నవ్వింది.

"మీ తెలివి తెల్లారినట్లే ఉంది.... అతనే దగాచంద్. మొన్నటి ఎడ్వెటైజ్ మెంట్లో అతని ఫోటో కూడా ఉంది.... పాపం! మనందరికీ చవగ్గా బట్టలమ్మి దివాళా తీస్తున్నాడు కదా!.... అందుకే అలా ఏడుస్తున్నాడు.... హి.. .. హి.... పదండి లోపలికి వెళ్ళి బట్టలు చూద్దాం...." అంది కామేశ్వరి గబగబా లోపలికి అడుగులు వేస్తూ.

కాంతారావు ఆమెని అనుసరించాడు - దగాచంద్ వంక వెనక్కి తిరిగి తిరిగి జాలిగా చూస్తూ.

"రండమ్మా రండి...." అన్నాడు వీళ్లని చూస్తూ చీరల సెక్షనులోని కౌంటర్లో మనిషి.

"మాంచి మాంచి చీరల్చూపించు బాబూ...." అంది కామేశ్వరి విలాసంగా.

"చూపించే దేముందమ్మా .... అదిగో.... అక్కడ గుట్టగా చీరలు పడేసి ఉన్నాయ్‌గా.... వాటిల్లోంచి సెలెక్ట్ చేసుకోడమే...."

కామేశ్వరి ఒక్క గంతు గెంతి చీరల గుట్టమీద పడింది. "చీరల గుట్టమీద అలా పడ్తే ఎలా? వేరే వాళ్లు కూడా సెలెక్షన్ చేస్కోవాలి కదమ్మా?.... మీరు గుట్టమీంచి లేవాలమ్మా...." అన్నాడు సేల్స్‌మాన్ మర్యాదగా
కామేశ్వరి ఓసారి సంతోషంగా చీర్లమీద పార్లి లేచి నిలబడింది.
"వామ్మోవ్!.... ఎన్ని చీరలో.... ఎన్ని చీరలో!!!" అంది కళ్లింతింత చేస్కుని చూస్తూ.
"తీస్కోండమ్మా.... మీ కోసమే ఈ చీరల్ని బాంబే నుండి తెచ్చాం...." అన్నాడు సేల్స్‌మాన్.
కామేశ్వరి గుట్టలోంచి ఆ చీరా ఈ చీరా కాస్సేపులాగి ఒక చీర సెలెక్ట్ చేసింది.
'ఈ చీరెంత బాబూ?" అడిగింది.
"ఇదా?.... ముప్పయి రూపాయలమ్మా...." చెప్పాడు.
"కెవ్వ్...." సంతోషంతో గట్టిగా అరిచింది కామేశ్వరి.
ఆ కేకకి సేల్స్‌మాన్ కంగారుపడిపోయాడు. గుమ్మం దగ్గరున్న దగాచంద్ ఏడుపాపి లోపలికి తొంగిచూశాడు.
"ఏంటమ్మా అలా అరిచారు?.... మేం తక్కువకేగా అమ్ముతున్నాం?...." అన్నాడు అయోమయంగా సేల్స్‌మాన్.
"అందుకే అలా అరిచాను ...." అంది కామేశ్వరి.
"తక్కువకి బట్టలమ్మేసి నేను చాలా దివాళా తీస్తున్నాన్రో దేవుడో...." అంటూ మళ్లీ ఏడుపు లంకించుకున్నాడు దగాచంద్.
అతని ఏడుపు చూసి అక్కడున్న అందరూ చాలా సంబరపడ్డారు.
బట్టలు చవగ్గా అమ్మి దివాళా తీస్తున్నాడు కాబట్టే అతనలా ఏడుస్తున్నాడు! అంతగా ఏడుస్తున్నాడంటే ఎంత లాభమో!!.... అనుకుని అక్కడి జనం బట్టల మీదికి ఎగబడ్డారు.
కామేశ్వరి రెండు చీరలు కొనుక్కుంది.
"అయ్యగారికి సూటింగ్స్ చూస్తారమ్మా?.... పది పర్సెంట్ నుండీ తొంభై పర్సెంట్ డిస్కౌంట్ ఉంది...." అన్నాడు సేల్స్‌మాన్.
"తొంభై పర్సెంట్ డిస్కౌంట్!.... నాకు అవే చూపించు బాబూ!" అన్నాడు కాంతారావు సంతోషంగా.
అతను ఒక జత బట్టలు కొనుక్కున్నాడు. ఆ తరువాత రెండు దుప్పట్లూ, నాలుగు టవల్స్ కొన్నారు.
ఇన్ని కొన్నా బిల్లు మూడువందల రూపాయలు మించలేదు.

ఇంటికి వెళ్ళి కొన్నవన్నీ బయటికి తీసి మరీ మరీ చూస్కుని మురిసిపోయారు.
"పాపం! .... ఆ దగాచంద్‌ని చూస్తుంటే చాలా జాలేస్తుంది కదండీ?.... హిహి.... బట్టలన్నీ చవగ్గా ఎంతమంది కొట్టేస్తున్నారో!.... భలే! దివాళా తీస్తున్నాడు...." అంది కామేశ్వరి తన చీరల వంక మెరిసే కళ్లతో చూస్కుంటూ.
కాంతారావు బట్టలు కుట్టడానికి టైలర్‌కిస్తే కుట్టడానికి జతకి తొంభై రూపాయలు చెప్పాడు టైలర్.
అది వింటూనే కాంతారావు కిసుక్కున నవ్వాడు.
"నేనసలు ఈ బట్టలు ఎంతక్కొన్నానో తెల్సా? డెబ్బయి అయిదు రూపాయలక్కొన్నాను.... ఇప్పుడు చెప్పు.... కుట్టుకూలీ ఎంత ఇమ్మంటావ్?" అన్నాడు కళ్లెగరవేసి నవ్వుతూ.
"మీరు వెయ్యి రూపాయల డ్రస్సుకొన్నా తొంభై రూపాయలకే కుడ్తాం. యాభై రూపాయల డ్రస్సు కొన్నా తొంభై రూపాయలకే కుడ్తాం.... అది మా రేటు సార్!...."
కాంతారావు నోరు మూసుకుని బట్టలు టైలర్‌కిచ్చి ఇంటికి వెళ్ళాడు. టైలర్ బట్టలు కుట్టి ఇచ్చాక కాంతారావు వాటిని తొడుక్కొని నిలువుటద్దంలో చూస్కుని మురిసిపోయాడు. కామేశ్వరి కూడా కొత్త చీర కట్టుకుని సంబరపడిపోయింది. డిస్కౌంట్ సేల్‌లో కొన్న దుప్పటి, టవల్స్ కూడా వాడారు.
ఆ రోజు డిస్కౌంట్‌లో కొన్న బట్టల్ని ఉతికి తాడుమీద అరబెట్టిన కామేశ్వరి కెవ్వుమని అరిచి మూర్ఛపోయింది. కారణం - ఆమె చీర ఓణీ అయిపోయింది. కాంతారావు చొక్కా, పాంటు చిన్న పిల్లల బాబాసూట్‌లా అయిపోయింది. టవల్ సైజు చిన్నది కాబట్టి ఏకంగా మాయం అయిపోయింది!

* * *